బూతుల నాయకులకు.. పోలింగ్ బూత్‌లో సమాధానం

ప్రజలకు కావాల్సింది బూతుల నేతలు కాదు

భవిష్యత్తును బాగు చేసే నాయకులు

రాష్ట్రాభివృద్ధికి రాజీపడకుండా కృషి చేశాం

నియామకాలపై జరిగే దుష్ప్రచారం నమ్మొద్దు

ఎన్నికల కమిషన్ అనుమతిస్తే మరుక్షణమే ఆర్టీసీ విలీనం

'మీట్ ద ప్రెస్' కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్/సిటీబ్యూరో, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): బూతులు తిట్టే నాయకులకు ప్రజలు పోలింగ్ బూత్‌లలోనే సమాధానం ఇస్తారని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రంలోని విపక్షాలకు ఎజెండా అంటూ లేదని, అందుకనే సీఎం కేసీఆర్‌ను, బీఆర్ఎస్ నేతల్ని వ్యక్తిగతంగా తిడుతున్నారని మండిపడ్డారు. టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. అసెంబ్లీలో ప్రస్తావించేందుకు సమస్యలేవీ లేకపోవడంతో విపక్ష నేతలు తమను వ్యక్తిగతంగా టార్గెట్ చేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలను చెప్పుతో కొట్టాలని ఒక నేత అన్నారని, బూటుతో కొట్టాలని తాము అనగలమని కానీ, ప్రజలకు కావాల్సింది బూతులు మాట్లాడే నేతలు కాదని, భవిష్యత్తును బాగుచేసే వారని పేర్కొన్నారు. కార్యదక్షత కలిగిన సీఎం కేసీఆర్ చేతిలో ఉండటం వల్లే రాష్ట్రం నేడు అన్ని రంగాల్లోనూ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ 90 అమలు చేస్తారని పేర్కొన్నారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో కరువు, కర్ఫ్యూ, కులం, మతం, ప్రాంత వివక్ష లేదని, వాటర్ ట్యాంకర్ బిల్లులు లేవని, జనరేటర్ల చప్పుళ్లు లేవని వివరించారు.

ఈ మూడూ చూసుకొని ఓటెయ్యండి

గత పాలనకు.. నేటి పాలనకు తేడా, పొరుగు రాష్ట్రాల అభివృద్ధి.. మన రాష్ట్రంలోని అభివృద్ధి, కేంద్రం ప్రకటించే ర్యాంకులు, అవార్డులు.. ఈ మూడింటిని బేరీజు వేసుకుని ప్రజలు ఓటు వేయాలని మంత్రి హరీశ్‌రావు సూచించారు. దేశ జనాభాలో 3శాతం ఉన్న తెలంగాణకు కేంద్రం ఇచ్చే అవార్డుల్లో 30 శాతానికిపైగా రావడం కేసీఆర్ పాలనకు అద్దం పడుతున్నదని పేర్కొన్నారు. స్థానికంగా కొంత వ్యతిరేకత ఉన్నప్పటికీ ఎమ్మెల్యేలు చేసిన మంచి పనులే పార్టీని గెలిపిస్తాయని అన్నారు. ఈ పదేండ్లలో లబ్ధిపొందిన లక్షలాదిమంది అండగా నిలుస్తారని తెలిపారు.

గుణాత్మక మార్పు తెచ్చాం

పదేండ్ల సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో అన్ని రంగాల్లోనూ గుణాత్మక మార్పు తెచ్చామని హరీశ్‌రావు చెప్పారు. దేశంలో కోతలు లేకుండా కరెంటు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. ఒకప్పుడు ఆకలి కేకలు వినిపించిన తెలంగాణ ఇప్పుడు పది రాష్ట్రాలకు అన్నం పెట్టే స్థాయికి ఎదిగిందన్నారు. కర్ణాటక నుంచి డబ్బులు సంచులతో నేతలు వస్తుంటే, తెలంగాణ నుంచి కర్ణాటకకు బియ్యం వెళ్తున్నాయని తెలిపారు. గ్రామాల్లో పల్లె దవాఖానలు, పట్టణాల్లో బస్తీ దవాఖానలు, నియోజకవర్గానికి ఒక 100 పడకల దవాఖాన, జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ, హైదరాబాద్ చుట్టూ నాలుగు టిమ్స్, 2 వేల పడకలతో నిమ్స్ విస్తరణ ఇలా అనేక సదుపాయాలు కల్పించామని చెప్పారు. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన తాగునీరు, రోడ్లు వంటి మెరుగైన సదుపాయాలను పల్లెలకు విస్తరించినట్టు చెప్పారు. ఐటీ ఉత్పత్తుల్లో, ఐటీ ఉద్యోగాల కల్పనలో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. ఒకప్పుడు రాష్ట్రంలో 270 గురుకులాలు ఉంటే ఇప్పుడు వెయ్యి దాటాయని పేర్కొన్నారు. పెద్దనోట్ల రద్దు, కరోనా కారణంగా విద్య, వైద్య రంగాల్లో అనుకున్నంత పురోగతి సాధించలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. మూడోసారి అధికారంలోకి వచ్చాక ప్రధానంగా వీటిపైనే దృష్టి సారిస్తామని వివరించారు.

నియామకాలపై దుష్ప్రచారం

నియామకాల విషయంలో దుష్ప్రచారం జరుగుతున్నదని హరీశ్‌రావు అన్నారు. మొదటి విడతలో 1.32 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశామని, రెండో విడుతలో 80 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ మొదలు పెట్టామని చెప్పారు. గతంలో ఉద్యోగాలకు 60: 40 కోటా ఉండేదని, 40 శాతం ఓపెన్ కోటాలో ఇతర ప్రాంతాలవారు తన్నుకుపోయేవారన్నారు. అందుకే ఉద్యోగాలన్నీ తెలంగాణ బిడ్డలకే దక్కేలా రాష్ట్రపతి ఉత్తర్వులను సవరించామని, కొత్త జోనల్ వ్యవస్థ తెచ్చామని చెప్పారు. రెండేండ్లపాటు కరోనా ప్రభావం చూపడం, రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణ కోసం ఏడాదిన్నర ఎదురు చూడాల్సి రావడంతో ఉద్యోగాల ప్రకటనలో కాస్త ఆలస్యం అయ్యిందన్నారు. ఇకపై రిటైరయ్యే ఉద్యోగుల స్థానాన్ని ఎప్పటికప్పుడు భర్తీచేస్తామని హామీ ఇచ్చారు. ప్రైవేట్ పరంగా పారిశ్రామిక రంగంలో 24 లక్షల ఉద్యోగాలు, ఐటీ రంగంలో 6 లక్షల ఉద్యోగాలు కల్పించామని వివరించారు.

బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటయ్యాయి

రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటయ్యాయని హరీశ్‌రావు ఆరోపించారు. దుబ్బాక, మునుగోడులో బీజేపీకి కాంగ్రెస్ సహకరిస్తే, ఇప్పుడు కాంగ్రెస్‌కు బీజేపీ సహకరిస్తున్నదని అన్నారు. బీఆర్ఎస్ పథకాలను కాపీకొట్టి కాంగ్రెస్ మ్యానిఫెస్టో తయారుచేసినా.. దాని కంటే బీఆర్ఎస్ మ్యానిఫెస్టోనే ఉత్తమంగా ఉందన్నారు. ఊరికి ఇద్దరు పైరవీకారులకు మేలు కలగాలంటే కాంగ్రెస్‌కు ఓటేయాలని, ఊరంతా మేలు కలగాలంటే కాంగ్రెస్‌కు ఓటేయాలని కోరారు. కేసీఆర్‌లాంటి పెద్దోళ్ల మీద పోటీచేసి తాము పెద్దవాళ్లు అవుతామనే భ్రమలో ఈటల, రేవంత్ రెడ్డి ఉన్నారని ఎద్దేవా చేశారు.

నాపై 200కుపైగా కేసులు

తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున్న ఎగసిపడుతున్న తరుణంలో సమైక్య పాలకులతో అంటకాగిన నీచ చరిత్ర రేవంత్‌రెడ్డిదని హరీశ్‌రావు దుయ్యబట్టారు. అలాంటి వ్యక్తి తనపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉన్నదన్నారు. ఉద్యమ సమయంలో తనపై 200కు పైగా కేసులు నమోదయ్యాయని గుర్తు చేశారు. వచ్చే ప్రభుత్వంలోనూ వైద్యారోగ్యశాఖ మంత్రిగానే బాధ్యతలు చేపట్టాలని ఉందంటూ మనసులో మాట బయటపెట్టారు. ప్రజలకు ఎక్కువ సేవ చేసే అవకాశం, ఆత్మసంతృప్తి ఆ శాఖలోనే ఉన్నాయని మంత్రి హరీశ్‌రావు వివరించారు.

ఆర్టీసీ విలీనం ఆలస్యానికి బీజేపీనే కారణం

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ ఆలస్యానికి బీజేపీనే కారణమని హరీశ్‌రావు ఆరోపించారు. తాము పంపిన బిల్లు గవర్నర్ ఆపారని విమర్శించారు. చివరి నిమిషంలో ఆమోదం తెలిపినా గెజిట్ సిద్ధం చేసే లోగానే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని గుర్తు చేశారు. గెజిట్ విడుదలకు ఇప్పటికీ సిద్ధంగా ఉన్నామని, అనుమతి కోసం ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశామని పేర్కొన్నారు. అనుమతి వచ్చిన మరుక్షణమే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పారు. మైనార్టీల ఓట్ల కోసమే బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనని కాంగ్రెస్ ప్రచారం చేస్తున్నదని దుయ్యబట్టారు. బీజేపీతో తమకు స్నేహం ఉంటే గవర్నర్ తమకు సహకరించి ఉండేవారన్నారు. బోరుబావుల దగ్గర మీటర్లు పెట్టలేదన్న సాకుతో కేంద్రం రూ.30 వేల కోట్లు ఆపిందని విమర్శించారు. ప్రభుత్వం తరపున సైనిక్ స్కూల్‌కు భూ కేటాయింపులు మూడేండ్ల కిందటే చేశామని, అయినా నిర్మాణానికి ఇప్పటికీ ఒక్క ఇటుక వేయలేదన్నారు. తెలంగాణకు ఇస్తామన్న సైన్స్ మ్యూజియం విషయంలోనూ భూ కేటాయింపులకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగానే ఉన్నదన్నారు. కానీ, మ్యూజియాన్ని బీజేపీ గుజరాత్‌కు తరలించుకుపోయి తెలంగాణను వంచించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

> ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటమే ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం. ప్రతి ఇంటికి తాగునీరు అందించి ఆడబిడ్డల తిప్పలను తొలిగించాం. రాష్ట్రంలోని 13 లక్షల మంది ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ అందించాం. వ్యవసాయ రంగాన్ని ఆదుకునేందుకు 69 లక్షల మంది రైతులకు 11 విడతలుగా రూ.72వేల కోట్లు రైతుబంధు కింద పంపిణీ చేశాం. 34 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నాం. గ్రామాలు, పట్టణాల్లో అన్ని రకాల వసతులు కల్పించి వారి జీవన ప్రమాణాలను పెంచాం.
>
> - మంత్రి హరీశ్‌రావు

> ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటింది. అధికారం కోసం రాజకీయాల్లోకి వస్తున్న పారిశ్రామిక, వ్యాపార, రియల్ ఎస్టేట్ వ్యాపారులతో ధన ప్రవాహం పెరిగింది. దీనివల్ల ప్రజా సేవలో అంకితభావంతో పనిచేసిన నాయకులు వెనకబడిపోతున్నారు. ప్రజలు పరిణతితో ఆలోచించి ప్రజాస్వామ్యానికి పరిరక్షకులు ఉండాలి.
>
> - మంత్రి హరీశ్‌రావు

> వ్యవసాయానికి 24 గంటల కరెంటు సరఫరాపై కాంగ్రెస్ మాట్లాడటం సిగ్గుచేటు. దేశంలోని ఏ రాష్ట్రమైనా తెలంగాణ మాదిరిగా ఇస్తున్నదా? కర్ణాటకలో 5 గంటలు ఇస్తున్నామని చెప్పుకుంటున్నా, అక్కడ ఇస్తున్నది రెండుమూడు గంటలే. కాంగ్రెస్ పాలిత ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లో ఏడు గంటలు మాత్రమే ఇస్తున్నారు. అలాంటివాళ్లకు మమ్మల్ని విమర్శించే హక్కు లేదు.
>
> - మంత్రి హరీశ్‌రావు

హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ): సంగారెడ్డి, ఆందోల్ నియోజకవర్గాల్లోని కాంగ్రెస్, బీజేపీకి చెందిన కీలక నేతలు మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. శివరాజ్‌పాటిల్ వందలాదిమంది అనుచరులతో తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. మంత్రి హరీశ్‌రావు వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో కాంగ్రెస్ ఉపసర్పంచ్ రమేశ్‌రెడ్డి, వార్డు సభ్యులు నర్సింలు, రత్నాకర్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, సదాశివపేట మండల బీజేవైఎం అధ్యక్షుడు అంజియాదవ్, మైనారిటీ అధ్యక్షుడు షేక్ మొబిన్ కబీర్, ఆయన అనుచరులు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ భవన్ ఇన్‌చార్జీ, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, నాయినేని రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బరిలో 2290 మంది

- 608 నామినేషన్ల విత్‌డ్రా
- నారాయణపేటలో ఏడుగురే పోటీ
- ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

హైదరాబాద్, నవంబరు 15 (నమస్తే తెలంగాణ): నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన అనంతరం రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో మొత్తం 2,290 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు బుధవారంతో ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 608 మంది తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. రాష్ట్రంలో అతి తక్కువగా నారాయణపేట నియోజకవర్గంలో ఏడుగురు అభ్యర్థులు పోటీలో నిలిచారు. అత్యధిక నామినేషన్లు దాఖలైన గజ్వేల్‌లో 70 మంది స్వతంత్రులు ఉపసంహరించుకోవడంతో 44 మంది బరిలో నిలిచారు. బరిలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల సంఘం ఎన్నికల గుర్తులు కేటాయించింది. జాతీయ, ప్రాంతీయ పార్టీలకు ఆయా పార్టీల ఎన్నికల చిహ్నాలనే కేటాయించారు. రిజిస్టర్డ్ పార్టీలకు వారి వినతి మేరకు కామన్ సింబల్ కేటాయించగా, ఇండిపెండెంట్ అభ్యర్థులకు వారు కోరుకున్న గుర్తులను కేటాయించారు. ఒకే గుర్తును ఇద్దరు అంతకంటే ఎక్కువ మంది కోరుకున్న చోట లాటరీ తీశారు. బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థుల వరుస క్రమాన్ని కూడా ఖరారు చేశారు. దీంతో గురు, శుక్రవారాల్లో అభ్యర్థుల బ్యాలెట్ పేపర్లను ముద్రించనున్నారు. ఈ నెల 30న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనున్నది. రాష్ట్రంలోని అత్యధిక నియోజకవర్గాల్లో 16 మందిలోపే అభ్యర్థులు ఉండటంతో ఒకే బ్యాలెట్ యూనిట్ ద్వారా పోలింగ్ నిర్వహించనున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో మాత్రం మూడు బ్యాలెట్ యూనిట్‌లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడింది.

పోలింగ్ స్లిప్పుల పంపిణీ

రాష్ట్రంలో నామినేషన్‌ల ప్రక్రియ పూర్తి కావడంతో పోలింగ్ స్లిప్పుల పంపిణీని ఎన్నికల అధికారులు ప్రారంభించారు. కొన్ని జిల్లాల్లో బుధవారం నుంచే ఈ ప్రక్రియ ప్రారంభం కాగా మిగిలిన జిల్లాల్లో గురువారం నుంచి ప్రారంభించనున్నారు. ఈ నెల 25లోగా పోలింగ్ స్లిప్పుల పంపిణీ పూర్తి చేయనున్నారు.

దళిత ప్రగతి బంధు

మొదటిపేజీ తరువాయి...

విషయాలు వెలుగులోకి వచ్చాయి. హుజూరాబాద్ నియోజకవర్గంలోని ఐదు మండలాలు, రెండు మున్సిపాలిటీల్లో మొత్తంగా 18,025 దళితబంధు లబ్ధిదారులున్నారు. సర్వే కోసం 16,149 యూనిట్లను సెస్ ఎంపిక చేసుకొన్నది. వీటిలో 14,879 వ్యక్తిగత యూనిట్లు కాగా, 1270 గ్రూప్ యూనిట్లున్నాయి. మొత్తం దళితబంధు లబ్ధిదారుల్లో 5 శాతం.. అంటే 807 మందిపై సెస్ ఈ సర్వేను నిర్వహించింది. ఎంటర్‌ప్రైజెస్, వ్యవసాయం, అనుబంధ రంగాలకు సంబంధించి పశుసంరక్షణ, తయారీ, రిటైల్, సేవలు, రవాణాకు సంబంధించి ఏడు విభాగాల్లోని యూనిట్లపై దృష్టి సారించింది. పథకానికి సంబంధించి మూడు ప్రభావాలను అంచనా వేసేందుకు అధ్యయనం చేసింది. ముడిసరుకు, ఇతర నిర్వహణ ఖర్చులతో సహా హుజూరాబాద్‌లోని దళితబంధు యూనిట్ల వార్షిక ఇన్‌పుట్ ఖర్చులు, వార్షిక ఆదాయం, దళిత కుటుంబాలపై సామాజిక-ఆర్థిక ప్రభావం, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సవాళ్లు తదితర అంశాలపై సెస్ స్టడీ చేసింది.

దళితబంధు లబ్ధిదారుల వ్యక్తిగత వివరాలు

భూమిలేని వారు	53.2శాతం
1హెక్టార్ ఉన్నవారు	42.3శాతం
1-2 హెక్టార్ ఉన్నవారు	3.4శాతం
2-10హెక్టార్	1.1శాతం

హుజూరాబాద్ నియోజకవర్గంలో..

దళితబంధు యూనిట్ల పెట్టుబడి విలువ
1932.30 కోట్లు

వార్షిక నిర్వహణ పెట్టుబడి
578.60 కోట్లు

ముడిసరుకు పెట్టుబడి
506.90 కోట్లు

వార్షిక నిర్వహణ వ్యయం
71.70 కోట్లు

వార్షిక ఉత్పత్తి టర్నోవర్ విలువ
867.60 కోట్లు

వార్షిక ఆదాయం (అంచనా)
289.00 కోట్లు

దళితబంధు లబ్ధిదారుల కోరుకుంటున్న శిక్షణ..

26%	డీలింగ్ విత్ కాంపిటేటర్
45%	వినియోగదారులు
30%	మార్కెటింగ్ అడ్వర్‌టయిజ్‌మెంట్
15%	ఫైనాన్షియరల్, అకౌంట్స్
80%	బ్యాంక్ లోన్ ట్రాన్సక్షన్
50%	మెషినరీ ఆపరేషన్
60%	నిర్వహణ సంబంధిత శిక్షణ

లబ్ధిదారుల ఆదాయం..

వర్గం	వార్షికాదాయం	నెలవారీ ఆదాయం
ఒక యూనిట్‌కు	రూ.1.43లక్షలు	11,917
ఒక కుటుంబానికి	రూ.1.28లక్షలు	10,667

18025 దళితబంధు యూనిట్ల ద్వారా ఉపాధి పొందుతున్న 19042 మంది

యూనిట్ల ద్వారా అదనంగా కలుగుతున్న ఉపాధి అవకాశాలు 4372మంది

ఒక్కో యూనిట్ ద్వారా ఉపాధి పొందుతున్న వారు 1.45మంది

ఒక్కొక్కరికి చెల్లిస్తున్న సగటు వేతనం రూ.23,656

లబ్ధిదారుల అభిప్రాయం

ఆదాయం పెరిగింది	93శాతం
ఏ మార్పులేదు	7శాతం
నిరుద్యోగిగా ఉండి దళితబంధు ద్వారా ఉపాధి పొందిన వారు	24.9శాతం
యూనిట్ ఏర్పాటుకు ముందునుంచే ఉపాధి పొందుతున్న	75.1శాతం
పనిదినాలు పెరిగాయి	45.1శాతం
కుటుంబఖర్చు పెరుగుదల	11.4 నుంచి 11.9శాతం
ప్రాథమిక అవసరాలు తీర్చుకుంటున్నవారు	68.6శాతం నుంచి 93.5శాతం
పొదుపు పెరిగింది	95.7శాతం
రుణపరపతి పెరిగింది	94.3శాతం
దళితబంధు యూనిట్ ద్వారా అప్పు చెల్లించుకుంటున్నవారు	61.9శాతం
పిల్లలను ఉన్నత విద్య చదివిస్తున్నవారు	75.5శాతం

దళితబంధు లబ్ధిదారుల యూనిట్ల ఎంపిక ఇలా..

స్థానిక డిమాండ్ మేరకు	72.02%
అందుబాటులో ఉన్న స్కిల్డ్ లేబర్ ఆధారంగా	45.08%
అందుబాటులో ఉన్న ముడిసరుకు ఆధారంగా	50.24%
గత అనుభవం ఆధారంగా	70.34%
తక్కువ సాంకేతికత, సులభతర నిర్వహణ	45.25%
కుటుంబీకులు, స్నేహితుల సూచన మేరకు	52.23%
అధికారులు సూచనల మేరకు	11.48%
ఇతర వ్యాపారుల స్ఫూర్తితో	14.55%

దళితుల జీవితాల్లో గణనీయమైన మార్పు

దళితబంధు పథకం దళితుల జీవితాల్లో గణనీయమైన మార్పులు తీసుకొస్తున్నట్టు సెస్ అధ్యయనం వెల్లడించింది. కోళ్ల ఫారాలు, సిమెంట్ ఇటుకల తయారీ యూనిట్లు, ఫొటో స్టూడియో యూనిట్లు మెరుగ్గా పనిచేస్తున్నాయని నిర్ధారించింది. దళిత పారిశ్రామికవేత్తల్లో 85 శాతం మంది తమ ఉత్పత్తులు, సేవలను నేరుగా మార్కెట్‌లోని తుది వినియోగదారులకు విక్రయిస్తున్నామని తెలిపారు. 16,149 యూనిట్ల ద్వారా దళిత కుటుంబాలకు చెందిన 19,042 మంది కుటుంబ సభ్యులతోపాటు మరో 4,372 మంది ఇతర కూలీలు ఉపాధి పొందుతున్నారని సెస్ వెల్లడించింది. ప్రతి కూలీకి నెలకు సగటున రూ.23,656 వేతనం చెల్లిస్తున్నారని తెలిపింది. డైరీ, పౌల్ట్రీ, పేపర్ ప్లేట్ తయారీ, మినీ సూపర్ బజార్లు, కిరాణా దుకాణాలు, టెంట్‌హౌస్ మొదలైనవి ఒకటికంటే ఎక్కువ కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్నాయని పేర్కొన్నది. హుజూరాబాద్ నియోజకవర్గంలోని దాదాపు 70 శాతం మంది దళిత పారిశ్రామికవేత్తలు గత అనుభవం ఆధారంగానే, తమ ఉత్పత్తికి తగినంత డిమాండ్ ఉంటుందని గ్రహించి యూనిట్లను ఎంచుకున్నారని తెలిపింది. దాదాపు సగం మంది దళిత పారిశ్రామికవేత్తలు (54,3%) తమ యూనిట్లను విస్తరించాలని భావిస్తున్నారని, కొత్త రకం ఉత్పత్తులను మార్కెట్లో ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు రూపొందించుకొంటున్నారని సర్వేలో తేలింది. దళితబంధు పొందిన కుటుంబాల్లో 94 శాతం మంది వార్షిక గృహఆదాయం పెరిగిందని నివేదించింది. దళితబంధు పథకం హుజూరాబాద్ నియోజకవర్గంలో ఆశాజనకమైన, దళిత పారిశ్రామికవేత్తల విధానానికి బీజాలు పడ్డాయని సెస్ అధ్యయనం నివేదించింది.

లబ్ధిదారుల భవిష్యత్ ప్రణాళికలు..

యథావిధిగా కొనసాగిస్తాం	27.8శాతం
మరింతమందిని నియమించుకుంటాం	20.8శాతం
యూనిట్ విస్తరణ	54.3శాతం
మార్కెట్ సైజ్ పెంపు	49.9శాతం
కొత్త ఆవిష్కరణలను ప్రవేశపెట్టడం	23.8శాతం
కొత్త బ్రాండ్‌లను ఏర్పాటు	7.0శాతం
ఎలాంటి ప్రణాళికలు లేవు	7.8శాతం

దళితబంధు యూనిట్ల ఉత్పత్తి, సేవల తీరు..

లబ్ధిదారులే నేరుగా మార్కెట్ చేసుకుంటున్నవారు	84.8శాతం
ఇతర ఉత్పత్తిదారులకు సరఫరా చేస్తున్నవారు	5.8శాతం
హోల్‌సేల్, రిటైలర్స్	11.6శాతం
ప్రభుత్వ శాఖలు, సంస్థలకు సరఫరా చేస్తున్నవారు	1.1శాతం
పేరెంటింగ్ కంపెనీకి	1.6శాతం

సామాజిక మార్పులు

43.6% ఇప్పటికే గౌరవం పొందుతున్నవారు	50.5% ఇతరుల నమ్మకం పొందుతున్నవారు
11.5% కొత్తగా గౌరవం పొందుతున్నవారు	12.2% ఇప్పుడిప్పుడే నమ్మకం పొందుతున్నవారు
40% గతంలో ఇచ్చే కంటే గౌరవమర్యాదలు పెరిగాయి	32.2% గతంలో కంటే నమ్మకం పెరిగింది
4.9% గౌరవం పొందని వారు	5.1% ఇంకా ఇతరుల నమ్మకం పొందనివారు
50% ఇతరుల సహకారం పొందుతున్నవారు	14.9 % ఇప్పుడే కొత్తగా
30.8% గతంలో కంటే పెరిగింది	4.3% సహకారం పొందనివారు

ఇతర వర్గాల నుంచి శుభకార్యాలకు ఆహ్వానాలు అందుతున్నవారు	60.6%
9.0% ఇప్పుడు కొత్తగా	23.7% ఆహ్వానాలు పెరగడం
ఆహ్వానాలు అందుకోనివారు	6.7%
29.5% గౌరవమర్యాదలు కొత్తగా పొందుతున్నవారు	66% ఇప్పటికే పొందుతున్నవారు
ఇతరు సామాజికవర్గాల్లో స్నేహితులను కలిగినవారు	63.1%
ఇప్పుడే కొత్తగా స్నేహసంబంధాలు పెంచుకుంటున్నవారు	31.6%
ఇప్పటికే సమానత్వాన్ని పొందుతున్నవారు	58.5%
కొత్తగా సమానత్వాన్ని పొందుతున్నవారు	33.9%
శుభకార్యాలకు వస్తున్న ఇతర కులాల వారు	58.7%
కొత్తగా ఇటీవల కాలంలో వస్తున్నవారు	35.1%